# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శనివారం 24 మే 2025 పేజీలు 8


# హైదరాబాద్ సిటీలో పాత ఫ్లాట్లకు నో డిమాండ్..
## ఔటర్ రింగ్ రోడ్డువైపే అందరి చూపు




- కోర్ సిటీలో పాత ఫ్లాట్లకు నో డిమాండ్..భారీగా ఫర్ సేల్ బోర్డులు
- ప్రధాన ప్రాంతాల్లోనూ భారీగా ఫర్ సేల్ బోర్డులు
- ఎస్ఎఫ్‌టీ రూ. 4000 కు కూడా కొంటలేరు
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలే కారణం
- బేగం బజార్ లో డిఫరెంట్ పరిస్థితి
- అక్కడ చదరపు గజం రూ. 10 లక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ట్రాఫిక్ పరేషాన్.. కాలుష్యం.. హైదరాబాద్ ను పరేషాన్ చేస్తున్నాయి. దీంతో చాలా మంది సిటీ వీడి ఔటర్ వైపు ఔటర్ రింగ్ రోడ్డు వైపు వెళ్లిపోతున్నారు. పశ్చిమాన మేడ్చల్ దాటాక కూడా కొత్త నిర్మాణాలు అక్కడే విల్లాలు, ఫ్లాట్లు కొనుక్కొంటున్నారు. ప్రధాన ప్రాంతాల్లోని పాత ఫ్లాట్లు అమ్మకానికి పెట్టినా కొనే వారే కరువయ్యారు. చదరపు అడుగు రూ. 4 వేలకు కూడా అమ్ముడుపోని పరిస్థితి నెలకొంది. నగరంలోని హిమాయత్ నగర్,చిక్కడపల్లి, ముషీరాబాద్, అశోక్ నగర్, రాంనగర్, నారాయణగూడ, కాచిగూడ, తార్నాక, మెహదీపట్నం, బేగంపేట, సికింద్రాబాద్, నిజాంపేట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో పాత ఫ్లాట్ల అమ్ముతామంటూ బోర్డులు పెట్టినా, ప్రకటనలు ఇచ్చినా కొనే వారు కరువయ్యారు. హైదరాబాద్ కు వలసలు పెరిగిపోవడం.. మధ్య సిటీలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ఇక్కడ ఇండ్లు ,ఫ్లాట్లు కొనుగోలు చేస్తే త్వరగా గమ్యస్థానాన్ని చేరుకోలేమన్న భావన చాలా మందిలో ఉంది. దీనికి తోడు కాలుష్యం కూడా ఈ ప్రాంతాలను ఇబ్బందుల పాలు చేస్తోంది. దీంతో మధ్య సిటీ క్రమంగా ఖాళీ అవుతోంది. ఈ పరిణామం ప్రభావం ఎలా ఉండబోతోందన్నది చర్చనీయాంశంగా మారింది. బేగం బజార్ డిఫరెంట్ఓల్డ్ సిటీలోని బేగంబజార్ ది డిఫరెంట్ పరిస్థితి. ప్రధాన వ్యాపార సంస్థలు అక్కడే ఉండటం, నార్త్ ఇండియా నుంచి వచ్చిన మార్వాడీలు, గుజరాతీలు, సింధీలు అక్కడ స్థిరపడ్డారు. ఇక్కడ వ్యాపార అవసరా ల కోసం భూములు కొనుగోలు చేసేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నా అమ్మే వారు లేరు. గతేడాది చదరపు గజం ధర రూ. 10 లక్షలు పలికిందంటే పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు కూడా సిటీ బయట ప్రశాంతంగా ఉండేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

# ఆ లెటర్ ఉత్తదే .. కేసీఆర్‌కు సలహా ఇచ్చే స్థాయిలో ఆమె ఉందా..

ఆ లెటర్ కేటీఆర్, హరీశ్‌రావు తయారు చేయించి వదిలారు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎమ్మెల్సీ కవిత లేఖ ఉత్తదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కు సలహా ఇచ్చే స్థాయిలో కవిత ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ పై ఎంత సేపు మా ట్లాడాలో కవిత డిసైడ్ చేస్తదా అని అన్నారు. కేటీఆర్, హరీశ్ రావులే ఈ లేఖ తయారు చేయించారని ఆరోపించారు. ఆ లేఖను కవిత పేరుతో బయటకు వదిలారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ ఎస్ కలిసి పోటీ చేయడం ఖాయమని ఈ లేఖతోనే బీఆర్?ఎస్?... బీజేపీ బంధం బయటపడిందని చెప్పాడు. వరంగల్ సభతో బీఆర్ఎస్ పని అయిపో యిందని తేలిపోయిందన్నారు. అందుకే ఈ డ్రామాలని అన్నారు.

# కేసీఆర్‌కు లేఖ రాసింది నిజమే.. ఆయన చుట్టూ దెయ్యాలున్నాయ్

- కేసీఆర్ దేవుడని, కానీ ఆయన చుట్టూ దెయ్యాలున్నాయని వ్యాఖ్య
- తాను రాసిన లేఖ లీక్ కావడంపై కుట్ర జరిగిందని ఆరోపణ
- పార్టీలోని కొందరు కోవర్టులే లేఖను బయటపెట్టారని అనుమానం
- లేఖలో వ్యక్తిగత అజెండా లేదని, కార్యకర్తల అభిప్రాయాలే ఉన్నాయని స్పష్టం
- పార్టీలోని లోపాలు సరిదిద్దుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని హితవు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖ లీక్ కావడంపై ఎమ్మెల్సీ కవిత తీవ్రంగా స్పందించారు. కేసీఆర్‌ను దేవుడితో పోల్చిన ఆమె, ఆయన చుట్టూ కొందరు దెయ్యాలు ఉన్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

-2 లో




# హైదరాబాద్‌లో కరోనా కలకలం

.. తాజాగా కేసు నమోదు కావడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ

- హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ వైద్యశాఖ ఆదేశం
- ఢిల్లీలో 23 కొత్త కోవిడ్ కేసులు నమోదు
- ఆసుపత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్ సిద్ధం చేయాలని ఢిల్లీ సర్కార్ సూచన

-2 లో

# కేసీఆర్‌కు లేఖ రాసింది నిజమే.. ఆయన చుట్టూ దెయ్యాలున్నాయ్

- మొదటి పేజీ తరువాయి

తాను కేసీఆర్‌కు లేఖ రాసిన మాట వాస్తవమేనని కవిత అంగీకరించారు. సుమారు రెండు వారాల క్రితమే ఈ లేఖ రాసినట్లు ఆమె తెలిపారు. అయితే, ఆ లేఖలో తన వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదని, కేవలం పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను మాత్రమే కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశానని స్పష్టం చేశారు. "ఆ లేఖ నాదే, అందులో నా వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదు. కార్యకర్తల అభిప్రాయాలు మాత్రమే చెప్పాను" అని కవిత పేర్కొన్నారు. అంతర్గతంగా తాను రాసిన లేఖ బయటకు రావడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వెనుక కచ్చితంగా కుట్ర ఉందని ఆరోపించారు. "కేసీఆర్ దేవుడు.. కానీ, కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. అంతర్గతంగా నేను రాసిన లేఖ బయటకు వచ్చిందంటే అర్థం ఏమిటి? నా లేఖ బయటకు వచ్చిందంటే పార్టీలో సామాన్యుల పరిస్థితి ఏంటి?" అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలోని కొందరు కోవర్టులే ఈ లేఖను లీక్ చేసి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆరే తమ నాయకుడని, ఆయన నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని కవిత పునరుద్ఘాటించారు. అయితే, పార్టీలోని లోపాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని తాను అభిప్రాయపడుతున్నట్లు తెలిపారు. కాగా, కవిత అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఆమెకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

# హైదరాబాద్‌లో కరోనా కలకలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ విజృంభించే సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత కొన్ని రోజులుగా అక్కడక్కడా కొవిడ్ కేసుల గురించి వార్తలు వస్తుండగా, తాజాగా హైదరాబాద్‌లో ఒక కేసు నమోదైంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఒక వైద్యుడికి కోవిడ్-19 పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ పరిణామంతో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆ వైద్యుడి ఆరోగ్య పరిస్థితి, కాంటాక్ట్ ట్రేసింగ్ వివరాలపై అధికారులు దృష్టి సారించారు.

**ఢిల్లీలోనూ పెరుగుతున్న కేసులు**

దేశ రాజధాని ఢిల్లీలో కూడా కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా 23 కొత్త కోవిడ్ కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రులలో పడకలు, ఆక్సిజన్, అవసరమైన మందులు, వ్యాక్సిన్లను సిద్ధంగా ఉంచుకోవాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలు కూడా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది.

# మహిళను చంపుతానని బెదిరించి డబ్బులు చోరీ. వ్యక్తిపై కేసు..నిందితుకోసం స్పెషల్ టీం గాలింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళను బెదిరించి డబ్బులు చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు కరీంనగర్ పోలీసులు. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళపై దాడి చేసి బెదిరించి నగదు చోరీ చేశాడు గుర్తు తెలియని వ్యక్తి..బాధితురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న వారు వచ్చి దొంగను పట్టుకునే ప్రయత్నంచేశారు. దొంగ తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన మాంకాళి మీనా(37) అదే మండలంలోని కొండాపూర్ లోని బంధువుల ఇంట్లో ఫంక్షన్ వెళ్లి వస్తుండగా.. ఓవ్యక్తి చంపుతానని బెదిరించి ఆమె దగ్గర ఉన్న రూ. 4వేల నగదు లాక్కున్నాడు. బాధితురాలు మీనా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు అక్కడికి చేరుకొని ఆమెను రక్షించారు. వారిని దొంగ అక్కడినుంచి పారిపోయాడు. మీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎక్స్ టార్షన్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు. ఈ ఘటనపై కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి స్పందించారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. నిందితుడిని పట్టుకొని త్వరలో కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

# మనం రోజూ చూసేవే... పిల్లల్లో చురుకుదనానికి సూపర్ ఫుడ్స్!




**హైదరాబాద్ పెన్ పవర్:** పిల్లల ఎదుగుదల దశలో వారికి సంపూర్ణమైన, సమతుల్యమైన పోషకాహారం అందించడం వారి శారీరక, మానసిక వికాసానికి అత్యంత కీలకం. మన దేశంలో లభించే అనేక రకాల ఆహార పదార్థాలు (సూపర్ ఫుడ్స్) సహజసిద్ధమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని పిల్లల రోజువారీ ఆహారంలో చేర్చడం ద్వారా వారి సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేయవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

భారతీయ సూపర్ ఫుడ్స్ అనేవి ప్రకృతి మనకు ప్రసాదించిన అమూల్యమైన కానుకలని, ఇవి పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా పెరిగేందుకు అవసరమైన శక్తివంతమైన పోషకాలను కలిగి ఉంటాయని ఎల్‌సీహెచ్‌హెచ్‌ఎస్‌కు చెందిన చీఫ్ న్యూట్రిషన్ ఆఫీసర్ దీపికా రాథోడ్ తెలిపారు. "మన పూర్వీకుల నుంచి సంక్రమించిన ఈ సంప్రదాయ ఆహారాలు పిల్లల శ్రేయస్సుకు తోడ్పడతాయి. వీటిని సులభంగా వారి రోజువారీ ఆహారంలో భాగం చేయవచ్చు" అని ఆమె వివరించారు. పిల్లల ఆహారంలో రుచితో పాటు పోషణను అందించే కొన్ని భారతీయ సూపర్ ఫుడ్స్‌ను దీపికా రాథోడ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**వివిధ సూపర్ ఫుడ్స్ – ప్రయోజనాలు**

**చిరుధాన్యాలు (మిల్లెట్స్):** రాగులు, జొన్నలు వంటి గ్లూటెన్ రహిత చిరుధాన్యాలలో ఫైబర్, ఐరన్, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా ఉంచడంతో పాటు, రోజంతా నిలకడైన శక్తిని అందిస్తాయి. దీనివల్ల పిల్లలు చురుగ్గా ఉంటారు, చదువుపై దృష్టి సారిస్తారు. ఉదయం అల్పాహారంగా రాగి జావ ఇవ్వడం వల్ల నీరసం రాకుండా ఉంటుంది, పాఠశాలలో ఏకాగ్రత మెరుగుపడుతుంది.

**మునగ** : "అద్భుత వృక్షం"గా పిలిచే మునగాకులో విటమిన్ ఎ, సి, కాల్షియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, ఎదుగుదలకు, కంటిచూపు మెరుగుపడటానికి సహాయపడతాయి. రోజూ ఒక టీస్పూన్ మునగాకు పొడిని స్మూతీలు లేదా ఇతర ఆహార పదార్థాలలో కలపడం ద్వారా పిల్లలకు సహజసిద్ధమైన శక్తిని అందించవచ్చు.

**అమరాంత్ (రాజ్‌గిరా):** ఈ పురాతన ధాన్యంలో ప్రొటీన్లు, మెగ్నీషియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. ఇవి మెదడు పనితీరును మెరుగుపరిచి, అలసటను తగ్గిస్తాయి. మృదువైన, రుచికరమైన రాజ్‌గిరా లడ్డూలను చేసి పిల్లలకు స్నాక్స్‌గా లేదా ఆడుకున్న తర్వాత ఇవ్వవచ్చు.

**తులసి:** తులసి ఆకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లతో పోరాడటానికి, ముఖ్యంగా పాఠశాల సంబంధిత ఒత్తిడి సమయంలో మానసిక ప్రశాంతతకు సహాయపడతాయి. గోరువెచ్చని నీటిలో లేదా హెర్బల్ టీలో కొన్ని తులసి ఆకులు వేసి పిల్లలకు ఇవ్వవచ్చు.

**ఉసిరి** : ఉసిరికాయ విటమిన్ సి కి గొప్ప మూలం. ఇది సీజనల్ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా ఉసిరి తోడ్పడుతుంది. భోజనం తర్వాత చిన్న ఉసిరి ముక్క లేదా ఉసిరి క్యాండీ ఇవ్వడం ద్వారా పిల్లల ఆహారంలో దీన్ని సులభంగా చేర్చవచ్చు.

పిల్లల సమగ్ర ఎదుగుదలకు, వారిని ఆరోగ్యంగా ఉంచడానికి భారతీయ సూపర్ ఫుడ్స్ ఒక సహజమైన మార్గం. ఈ ఆహారాలను వారి రోజువారీ డైట్‌లో చేర్చడం వలన ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. అయితే, ఈ సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమేనని, ఏదైనా నిర్దిష్ట ఆరోగ్య సమస్య లేదా ఆహార ప్రణాళిక గురించి వైద్యుడిని సంప్రదించడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# శని ప్రదోష వ్రతం ఎప్పుడు.. ఆరోజు ఏం చేయాలి.. పాటించాల్సిన పరిహారాలు ఇవే..!

హైదరాబాద్ పెన్ పవర్:హిందూమతంలో ప్రదోష వ్రతాన్ని నెలకు రెండు సార్లు జరుపుకుంటారు. వైశాఖ మాసంలో ప్రదోష వ్రతం శనివారం మే 24 వ తేదీన వచ్చింది.. శనివారం ప్రదోష వ్రతం రావడం వల్ల దీన్ని శని ప్రదోష వ్రతం గా పిలుస్తారు.

శని ప్రదోషం రోజున శివుడుతో పాటు శని దేవుడిని పూజించడం వల్ల శని అశుభ ప్రభావాల నుంచి విముక్తి లభిస్తుంది. జీవితంలో ఆనందం, శ్రేయస్సు లభిస్తాయి. ఆరోజు ( మే 24) చేసే కొన్ని పనుల వల్ల పరమేశ్వరుడు తన భక్తుల అన్ని కోరికలను నెరవేరుస్తాడు. వారికి సంతోషం, అదృష్టాన్ని ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. ఈ రోజున శివుడితో పాటు శనీశ్వరుడిని పూజించడం వల్ల శని మహాదశ, అర్ధాష్టమ శని, ఏలినాటి శని సహా సకల బాధలు తొలగిపోతాయి.



**శని ప్రదోష వ్రత ముహూర్తం**

త్రయోదశి తిథి ప్రారంభం : మే 24, 2025 రాత్రి 07:20 గంటలకు

త్రయోదశి తిథి ముగింపు: మే 25, 2025 మధ్యాహ్నం 03:51 గంటలకు

ప్రదోష కాలము పూజ చేయాల్సిని ముహూర్తం: మే 24 రాత్రి 07:10 నుండి 09:13 వరకు

**శని ప్రదోష పూజా విధానం..**

శని ప్రదోష వ్రతం రోజున ఉదయాన్నే నిద్రలేచి, స్నానం చేసిన తర్వాత శు భ్రమైన దుస్తులు ధరించాలి.

దేవుడు గదిని శుభ్రం చేసి శివుడికి సంబంధించిన లింగాష్టకం.. పఠించాలి.

పూజ గదిలో నెయ్యి దీపం వెలిగించండి.

శివ-పార్వతుల విగ్రహం ముందు పండ్లు, పూలు, ధూపం,దీపం, నైవేద్యాలు సమర్పించండి.

శివుడితో సహా సకల దేవతలకు హారతి ఇవ్వండి.

సాయంత్రం ప్రదోష ముహూర్తంలో పూజకు సిద్ధం చేయండి.

**సాయంత్రం ప్రదోష పూజ**

వీలైతే సాయంత్రం మళ్లీ స్నానం చేసి శివలింగంపై నీటిని సమర్పించండి. శివుడికి బిల్వపత్రాలను సమర్పించండి. శని ప్రదోష రోజున శివలింగానికి 108 బిల్వ పాత్రలను సమర్పించండి. ఆ రోజున మినపప్పు, నల్ల బూట్లు, దుస్తులు వంటివి దానం చేస్తే చాలామంచిదని పండితులు చెబుతున్నారు. శని ప్రదోష వ్రతం రోజున, సాయంత్రం శివయ్యను జలంతో ( నీటితో) అభిషేకం చేయండి. శని భగవానుడికి నల్ల నువ్వులు , బెల్లం సమర్పించండి.

'ఓం నమః శివాయ' అనే మంత్రాన్ని పఠించండి. శివునికి హారతి ఇవ్వండి.

పూజ ముగిసిన తర్వాత క్షమించమని అడగండి. ఆ తర్వాత రావి చెట్టు దగ్గర ఆవ నూనె దీపం వెలిగించాలి. శనీశ్వరుడిని ఆరాధించండి. శనీశ్వరుని మంత్రాలను పఠించండి.

# మైసూర్ పాక్ అనొద్దు.. ఇప్పుడు మైసూర్ శ్రీ..జైపూర్ అన్ని స్వీట్ షాపుల్లో ఇవే బోర్డులు..ఎందుకో తెలుసా?




హైదరాబాద్ పెన్ పవర్:ఇకపై మైసూర్ పాక్‌ను అలా పిలవొద్దు..మైసూర్ శ్రీ అని పిలవాలి..జైపూర్‌లో స్వీట్ షాపుల్లో మొత్తం ఇదే బోర్డులు..మైసూర్ పాక్ ఒక్కటే కాదు.. పాక్ అనే పదం ఉన్న అన్ని స్వీట్ల పేర్లు మార్చేశారు. పాక్ ఎక్కడ ఉన్నా దానిని రీప్లేస్ చేస్తాం..పాక్ అనే పదం మాకు నచ్చదు అంటున్నారు అక్కడి స్వీట్ షాపు యజమానులు. షాపు యజమానులు ఎందుకు అలా చేస్తున్నారో.. అలా ఎందుకు చెబుతున్నారో వివరాల్లోకి వెళితే..

రాజస్థాన్‌లోని జైపూర్‌లోని స్వీట్ షాపులన్నీ ప్రసిద్ధ మైసూర్ పాక్‌తో సహా అన్ని స్వీట్ల పేర్లను మార్చాయి.తమ స్వీట్ల పేర్లన్నింటి నుంచి 'పాక్' అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'శ్రీ'అని చేర్చారు. మైసూర్ పాక్ ను మైసూర్ శ్రీగా, మోతీ పాక్' ను 'మోతీ శ్రీ' గా, 'గోండ్ పాక్' ను 'గోండ్ శ్రీ' గా, మార్చారు.

ఇదంతా ఎందుకు చేశారంటే.. భారత్, పాక్ ఉద్రిక్తతల మధ్య పాక్ అనే పదం వినపడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నామని షాపు యజమానులు చెబుతున్నారు. వాస్తవానికి పాక్ అంటే పాకిస్తాన్ ను సూచించదు. పాక్ అంటే కన్నడంతో తీపి అని అర్థం. కర్ణాటకలోని మైసూర్ పేరు మీద వచ్చిన ఘనీకృత పాలతో పొడి తీపిపదార్థాన్ని 'మైసూర్ పాక్' అని పిలుస్తారు.

ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్ లోని పహల్గాం ఉగ్రదాడి

తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్ సింధూర్ ప్రారంభించడం.. పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేయడం, ఆ తర్వాత ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఈ క్రమంలో సరిహద్దు రాష్ట్రాలైన రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర లో ని సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలు పాక్ పై ఆగ్రహంతో ఉన్నారు. దీంతో రాజస్థాన్ లోని జైపూర్ స్వీట్ సెంటర్ యజమానులు పాక్ పై ఇలా తమ అసహనం వ్యక్తం చేశారు.

# జిల్లా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:**పుట్టపర్తి మండలం మామల కుంట క్రాస్ వద్ద ఈనెల 24 న నిర్వహించే జిల్లా టీడీపీ మహానాడు ఏర్పాట్లను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఇతర టీడీపీ నాయకులు శుక్రవారం మహానాడు నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలించారు. టిడిపి జిల్లా మహనాడు కార్యక్రమాన్ని తొలి సారి సత్యసాయి జిల్లాలో నిర్వహించబోయే స్థలాన్ని వారు పరిశీలించి తగు సూచనలు సలహాలు అందించారు , మహానాడుకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి భోజన సదుపాయంలో ఎలాంటి లోటుపాటలు రాకుండా చూడాలని మాజీ మంత్రి పల్లె సూచించారు,జిల్లా మినీ మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,పార్టీ జిల్లా అద్యక్షులు అంజినప్ప కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆది నారాయణ, పుట్టపర్తి మండల కన్వీనర్లు బోయ రామాంజనేయులు , విజయ్ కుమార్ , సుబ్రి స్వామి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, రామారావు, లక్ష్మీపతి , గాయత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి గంగన్న, జిల్లా టిడిపి నాయకులు మండల నాయకులు కార్యకర్తలు తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాగమణి హొటల్ వీధిలో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

మైదుకూరు పట్టణం దిన దిన అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రోజురోజుకు పట్టణంలో చెత్త ఎక్కువ అవుతున్నది. అందులో భాగంగా కడప రోడ్డు నందు గల మేధా కాలేజ్ - నాగమణి హొటల్ సమీపాన, వీధి ప్రారంభంలో వ్యాపారస్తులు మరియు ప్రజలు వారి వెస్టేజ్ మరియు చెత్తను కుప్పలు కుప్పలుగా పోయుచు, ప్రతిరోజు పారిశుద్ధ్య నిర్వహణకు, రవాణాకు, పాదచారులకు ఆటంకం కలిగించుచున్నారు. ముఖ్యంగా

చుట్టుపక్కల హొటల్లో గల వేస్టేజ్,
బేకరీల వేస్టేజ్,
హాట్ చిప్స్ వేస్టేజ్,
అరటి మండి వేస్టేజ్,
మెడికల్ షాపుల వేస్టేజ్,
బుక్ షాపుల వేస్టేజ్,
తోపుడు బండ్ల వ్యాపారుల వెస్టేజ్,
ఫ్రూట్స్ మరియు వెజిటబుల్ వెస్టేజ్,
ఇళ్లల్లో జరుగు ఫంక్షన్ ల వేస్టేజ్
తదితరముల అన్ని రకాలు వెస్టేజ్ మరియు చెత్తను నాగమణి హొటల్ దగ్గర వేయుచున్నట్టు మున్సిపాలిటీ వారు గుర్తించడమైనది.

కావున నేటి నుండి అక్కడ చెత్త వేయడం పూర్తిగా నిషేధించడమైనది కావున ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అక్కడ చెత్త వేయి వారిపై, వ్యాపారస్తులపై భారీ జరిమానాలు విధించి, ప్రజారోగ్య చట్ట ప్రకారము మరియు మున్సిపల్ చట్ట ప్రకారము సంబంధిత వ్యక్తులు, వ్యాపారస్తులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తా: సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ మే 23: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పస్తాపూర్ బహిరంగ సభలో సిఎం పాల్గొన్నారు. సభలో మంత్రులు కొండా సురేఖ, దామోదర, ఎంపి సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. జిల్లా మహిళా సంఘాలు తయారు చేసిన స్టాళ్లను పరిశీలించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిందని, గత సిఎం కేంద్రం మీద అలిగి ఫామ్ హౌస్ లో పడుకున్నారని ఎద్దేవా చేశారు.చెరువు మీద అలిగితే ఎవరికి నష్టం.. మనకే కదా? అని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తానని చెప్పారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని.. సలహాలు ఇవ్వాలని సూచించారు. ప్రతిపక్ష నేత 40 ఏళ్ల అనుభవం ఉపయోగించి సలహాలు ఇవ్వాలని కోరారు. సిఎం పదవి దక్కలేదని అసెంబ్లీకి రాకుంటే ఎలా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రాకుంటే.. ప్రజలే చూసుకుంటారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులు సురక్షితం

**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రహ్మంగారిమఠం నుండి బద్వేల్ దిశగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు, రాజుపేట సమీపంలోని కాశినాయన ఆలయం వద్ద ప్రమాదకర మలుపులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కానుగ చెట్టును, ఢీకొని ముళ్లపదల్లోకి దూసుకెళ్లిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులెవరూ గాయపడకపోవడం అదృష్టకరంగా మారింది. బస్సుకు సంబంధించిన ముందు భాగం మరియు అద్దాలు కొంత మేరకు దెబ్బతిన్నాయి. డ్రైవర్ మలుపును గమనించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. ఈ కాశినాయన గుడి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల గత నెలలో ఒక ఆటో కూడా ప్రమాదానికి గురైంది. అదే చోట ఇప్పుడు ఆర్టీసీ బస్సు ప్రమాదానికి లోనవ్వడంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రాంతంలోని ప్రజలు, వాహనదారులు సంబంధిత అధికారులు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సర్వేయర్ పై చర్యలు తీసుకోవాలి ఆర్డీవోకు వినతిపత్రం

**కడప పెన్ పవర్:**కాశి నాయన మండలం ఇటుకుళ్లపాడు గ్రామ సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న నరసింహులు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అన్వేష్,వీరయ్య,పోలయ్య లు డిమాండ్ చేశారు.. బద్వేల్ ఆర్డీవో కార్యాలయంలోని ఏవో కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని వారు ఆరోపించారు.. భూమి సర్వే చేయుట కొరకు ప్రభుత్వానికి చలానా చెల్లించినప్పటికీ సర్వేయర్ కొలతలకు వస్తే వేల రూపాయల డిమాండ్ చేస్తున్నాడని వారు ఆరోపించారు.. బోర్ పాయింట్స్ కు సర్వే రిపోర్ట్ ఇవ్వాలంటే 2500 నుండి 3000 వరకు డిమాండ్ చేస్తున్నారన్నారు.. ఇలాంటి అవినీతి సర్వేయర్ పై చర్యలు తీసుకోవాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేసిన అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని వారు మండిపడ్డారు.. ప్రజలను పట్టిపీడిస్తున్న ఇలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.. అతనిపై సమగ్ర విచారణ చేసి సస్పెండ్ చేయాలన్నారు.. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు..

## ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యాధికారి ముకేశ్ మరియు డాక్టర్ ఆంజనేయులు స్థానిక ఆసుపత్రి నందు ఆరోగ్య సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులు 3.0 సర్వేనందు ఆరోగ్య కేంద్ర సిబ్బంది జిల్లా స్థాయిలో ఆరవ స్థానము సంపాదించినందుకు అభినందనలు తెలియజేశారు. అసంక్రమిత వ్యాధుల అనుమానిత కేసుల సంఖ్యను పెంచాలని సూచించారు. క్షయ వ్యాధి కాంటాక్ట్స్ కు నిర్వహించే సి వై టి బి కేసుల సంఖ్యను వేగవంతము చేయాలని తెలిపారు. గర్భవతులు మరియు చిన్న పిల్లల ఆర్ సి హెచ్ పోర్టల్ నందు సర్వీసులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు.
డాక్టర్ ఆంజనేయులునాయక్ మాట్లాడుతూ వడదెబ్బ పై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఓ ఆర్ ఎస్ కార్నర్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి రామ్మోహన్ రెడ్డి సూపర్వైజర్ సుభాషిని ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి ప్రారంభమయ్యిన వరద ప్రవాహం

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీశైలం జలాశయానికి వరద పోటు ప్రారంభమయింది. ఇన్ ఫ్లో :22,509 క్యూసెక్కులువుంది. ఔట్ ఫ్లో : 7,007 క్యూసెక్కులు. పూర్తి స్దాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం : 817.20 అడుగులు వుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు. ప్రస్తుతం : 38.8000 టీఎంసీలు. ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం అయింది. కుడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కాలేదు.

## హనుమాన్ జంక్షన్ పోలీసుల కస్టడీకి వల్లభనేని వంశీ

**హైదరాబాద్ పెన్ పవర్:** వైకాపా నేత వల్లభనేని వంశీని హనుమాన్ జంక్షన్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. విజయవాడ జిల్లా జైలు నుంచి వంశీని కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు జరిపించారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో పోలీసు కస్టడీకి వల్లభనేని వంశీని కోర్టు అనుమతించింది.

## సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో దక్కని ఊరట

**హైదరాబాద్ పెన్ పవర్:** అట్రాసిటీ కేసులో సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సజ్జల భార్గవరెడ్డి అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలనిన్న ధర్మాసనం సూచించింది. ఇలాంటి కేసుల్లో బెయిల్ సులభంగా వస్తే ప్రతి ఒక్కరూ రెచ్చిపోతారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

## గ్రీన్ డ్రైవ్ను ప్రారంభించిన విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** రైల్వేలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడానికి పక్షం రోజుల పాటు నిర్వహించే గ్రీన్ డ్రైవ్ను సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ మేనేజర్ నరేంద్ర ప్రారంభించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడంపై దృష్టి సారించి సౌత్ సెంట్రల్ రైల్వేలోని విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో రెండు వారాలు పాటు జరిగే గ్రీన్ డ్రైవ్ను సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ మేనేజర్ నరేంద్ర ప్రారంభించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంలో స్థిరమైన పద్ధతులను స్వీకరించడంలో రైల్వే సిబ్బంది, ప్రయాణీకులు, సాధారణ ప్రజల నుండి అవగాహన కల్పించడం, చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ గ్రీన్ డ్రైవ్ లక్ష్యం అని రైల్వే అధికారులు తెలిపారు. తొలుత విజయవాడ డివిజనల్ ఆఫీస్ కాంపౌండ్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర, ఎ. పాటిల్ లు తమ సిబ్బంది, బ్రాంచ్ అధికారుల చేత పర్యావరణ అవగాహన ప్రతిజ్ఞను చేయించారు.

# హైదరాబాద్‌లోతెలంగాణ తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించిన ఆప్ట్రోనిక్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** బీభారతదేశంలో అతిపెద్ద ఆపిల్ ప్రీమియం రీ సెల్లర్ అయిన ఆప్ట్రోనిక్స్, తెలంగాణ తొలి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో వైభవంగా ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ స్టోర్, పూర్తి స్థాయిలో మార్పు చేయబడింది. ఈ స్టోర్‌లో ఇప్పుడు ప్రత్యేకమైన ఆపిల్–అధీకృత సర్వీస్ సెంటర్ కూడా ఉంది, ఇది ఒకే చోట సమగ్రమైన ఆపిల్ అనుభవాన్ని అందించనుంది. ఈ స్టోర్ ప్రారంభం ఆప్ట్రోనిక్స్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణలోని ఆపిల్ రిటైల్ కార్యకలాపాలకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. దాని మెరుగైన డిజైన్ మరియు వృద్ధి చేయబడిన కస్టమర్ అనుభవంతో, ఈ కొత్త ప్రీమియం పార్టనర్ స్టోర్ ఆపిల్ యొక్క ఉత్తమ ప్రపంచ రిటైల్ ప్రమాణాలను కలిగి ఉంది. ఆవిష్కరణలు, లీనమయ్యే సేవను కలుసుకునే ప్రాంగణాన్ని సృష్టిస్తుంది. ప్రత్యేక మైన ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా, స్టోర్‌ను సందర్శించే కస్టమర్‌లు తాజా ఐఫోన్‌లు, మ్యాక్‌బుక్‌లు, ఐప్యాడ్‌లు మరియు ఉపకరణాలతో సహా ప్రతి ఉత్పత్తిపై కనీసం 12% తగ్గింపును పొందవచ్చు. వేడుకలు అక్కడితో ఆగవు: ఆపిల్ కేర్ సేవలతో ప్రొటెక్ట్ ం పై ఫ్లాట్ 50% తగ్గింపు పాత స్మార్ట్‌ఫోన్‌లు లేదా ల్యాప్‌టాప్‌లను మార్చుకున్నప్పుడు రూ. 10,000 వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ సర్టిఫైడ్ ఆపిల్ నిపుణుల చేత స్టోర్‌లో మార్గదర్శకత్వం

కొత్తగా ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్‌లో తక్షణ అప్‌గ్రేడ్ మరియు మరమ్మతు సహాయం

"ఆపిల్ యొక్క రిటైల్ లక్ష్యంను ప్రతిబింబించే రీతిలో తీర్చిదిద్దిన స్టోర్‌తో ఆపిల్ ప్రీమియం పార్టనర్ అనుభవాన్ని హైదరాబాద్‌కు తీసుకురావడానికి మేము సంతోషిస్తున్నామని, ఈ ప్రారంభం ఆపిల్ యొక్క తాజా సాంకేతికతకు అసాధారణమైన సేవ , లభ్యతను అందించడంలో మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది" అని ఆప్ట్రోనిక్స్ వ్యవస్థాపకుడు సుతీందర్ సింగ్ అన్నారు."తెలంగాణలో మొట్టమొదటి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు.. ఇది స్టోర్ కంటే ఎక్కువ – ఇది మా బ్రాండ్ నైతికత , మా కస్టమర్‌లు మాపై ఉంచిన నమ్మకానికి ఒక వేడుక. ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ మరియు ప్రత్యేకమైన "తెలంగాణలో మొట్టమొదటి ఆపిల్ ప్రీమియం పార్టనర్ స్టోర్‌ను ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నాము. ఇది స్టోర్ కంటే ఎక్కువ – ఇది మా బ్రాండ్ నైతికత , మా కస్టమర్‌లు మాపై ఉంచిన నమ్మకానికి ఒక వేడుక. ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ మరియు ప్రత్యేకమైన ప్రారంభోత్సవ ఆఫర్‌లతో, మా కస్టమర్‌ల కోసం యాపిల్ కొనుగోలు , యాజమాన్య అనుభవాలను పెంచడానికి మేము సంతోషిస్తున్నామన్నారు." అని ఆప్ట్రోనిక్స్ సీఈఓ మేఘనా సింగ్ అన్నారు. ఇనార్బిట్ మాల్‌లోని కొత్త స్టోర్ అత్యాధునిక ఆపిల్ ఉత్పత్తులకు కేంద్రంగా మాత్రమే కాకుండా, సౌకర్యవంతమైన సేవ మరియు నిపుణుల సలహా కోసం గమ్యస్థానంగా కూడా పనిచేస్తుంది. మీరు మీ మొదటి ఐఫోన్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నా లేదా పాత మ్యాక్‌బుక్‌ను విక్రయించాలనుకుంటున్నా , ఆప్ట్రోనిక్స్ ఇనార్బిట్ ప్రతి కస్టమర్ ప్రయాణం ప్రీమియం అని నిర్ధారిస్తుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవాన్ని వేడుక జరుపుకోవడానికి మీరందరూ మాతో చేరాలని మేము ఆహ్వానిస్తున్నాము. ఈ గర్వించదగ్గ క్షణంలో భాగం అవ్వండి , తెలంగాణలో ఆపిల్ రిటైల్ భవిష్యత్తు కార్యకలాపాలను ఆస్వాదిస్తూ ప్రత్యేకమైన ఆఫర్‌లను సొంతం చేసుకోండి. హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లోని ఆప్ట్రోనిక్స్‌ను సందర్శించండి – ఇక్కడ ఆవిష్కరణలు శ్రేష్ఠతను కలుస్తాయి. నిబంధనలు %డ% షరతులు వర్తిస్తాయి.

# ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతి.. నీతా అంబానీ కీలక ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ కళలను పరిరక్షించడానికి రిలయన్స్ సంస్థ అధ్యక్షుడు ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ "నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (ఎన్ఎంఎసిసి)"ను 2023 మార్చి 31న ఏర్పాటు చేశారు. తాజాగా ఈ సంస్థ కీలక ప్రకటన చేసింది. న్యూయార్క్ నగరంలో "నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ఇండియా వీకెండ్" కార్యక్రమాన్ని జరపనున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 12 నుంచి 14 వరకూ నిర్వహించనున్నారు. లింకన్ సెంటర్ ఫర్ ది పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సంగీతం, థియేటర్, ఫ్యాషన్, పంటకాలతో వివిధ భారతీయ కళారూపాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు. ఈ ఇండియా వీకెండ్ మొదటి ఎడిషన్‌తో అంతర్జాతీయంగా ఓ మైలురాయి అరంగేట్రం చేయనుంది. మూడు రోజుల ఈ వేడుకలో 'ది గ్రేట్ ఇండియన్ మ్యూజికల్ : సివిలైజేషన్ టు నేషన్' ముఖ్యమైనది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద థియేట్రికల్ ప్రొడక్షన్. ఇందులో దాదాపు 100 మందికి పైగా కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. వీరిలో టోనీ, ఎమ్మీ అవార్డులు అందుకున్న వాళ్లు కూడా



ఉన్నారు. ఈ కార్యక్రమం గురించి నీతా అంబానీ మాట్లాడుతూ.. భారతదేశపు అత్యుత్తమ కళలను ప్రపంచానికి ప్రదర్శించడమే ఎన్ఎంఎసిసి ప్రధాన లక్ష్యమని అన్నారు. న్యూయార్క్‌లో జరిగే ఈ మూడు రోజుల వేడుక తమ ప్రయాణంలో మొదటి అడుగు అవుతుందని పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక లింకన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగడం.. అందులో మన గొప్ప సంస్కృతిని పంచుకోవడానికి ఉత్సాహంగా ఉందని అన్నారు.

# అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దైన, ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి



**జగిత్యాల: పెన్ పవర్:** ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన ధాన్యం తీర చేతికి అందేలోగా అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దైందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు.జిల్లా లోని రాయికల్ మండలంలోని శ్రీ రాంనగర్, సింగర్ రావు పెట్ గ్రామాలలో అకాల వర్షాలతో తడిచిన వరి ధాన్యాన్ని రైతులు మరియు నాయకులతో కలిసి మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత–సురేష్ పరిశీలించారు.. ఈ సందర్భంగా రైతులకు మద్దతుగా రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు.ఆనంతరం దావ వసంత మాట్లాడుతూ...ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన ధాన్యం తీర చేతికి అందే లోగా అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దైందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని అన్నారు.రేవంత్ ప్రభుత్వం రైతుని రాజుని చేస్తానని, రోడ్డు పాలు చేసిందని అన్నారు.ధాన్యం కొనుగోలు చేయాలంటూ రోడ్డుపై ఎక్కడికి అక్కడ రైతులు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు .ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్,నాయకులు చాంద్, రాజేశ్వర్ రెడ్డి,జలపతి రెడ్డి, గంగా రెడ్డి, రాజమౌళి, చంద్రయ్య ,శ్రీను, రవి, మల్లారెడ్డి, నరేష్, లక్ష్మణ్, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌పై కోపాన్ని తనదైన రీతిలో చూపించిన స్వీట్స్'వ్యాపారీ

**మైసుర్‌పాక్‌లో 'పాక్' ఉండటంతో ఆ స్వీట్స్'పేరును 'మైసూరు శ్రీ' గా మారు**



**జైపూర్ మే 23: పెన్ పవర్:** పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత యావత్ భారతదేశమంతా పాకిస్థాన్‌పై నిప్పులు చెరుగుతోంది. ఆ దేశానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ దాడులు చేయడంతో ఈ ఆగ్రహం కాస్త చల్లారినప్పటికీ.. ఇంకా పాక్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఎవరికి తోచిన రీతిలో వారు పాకిస్థాన్‌పై తమ ఆగ్రహాన్ని చూపిస్తున్నారు. తాజాగా రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని 'త్యోహార్ స్వీట్స్' దుకాణం వ్యాపారి పాకిస్థాన్‌పై తన కోపాన్ని తనదైన రీతిలో చూపించారు. మైసుర్‌పాక్‌లో పాక్ ఉండటంతో ఆ పదాన్ని తొలగించి స్వీట్ పేరును 'మైసూరు శ్రీ' అని మార్చేశారు.దుకాణ యజమాని అంజలీ జైన్ ఈ వినూత్న ఆలోచన చేశారు. మైసూర్‌పాక్‌తో పాటు తమ దుకాణంలో ఉండే మోతీ పాక్, ఆమ్ పాక్, గోండ్ పాక్‌లను కూడా మోతీ శ్రీ, ఆమ్ శ్రీ, గోండ్ శ్రీగా మార్చేశారు. స్వర్ణ భాషం పాక్, చాందీ భాషమ్ పాక్‌ను కూడా స్వర్ణ శ్రీ, చాందీ శ్రీగా అని పేరు పెట్టారు. ఈ సందర్భంగా అంజలీ మాట్లాడుతూ.. సరిహద్దులోనే దేశభక్త ఉంటే సరిపోదు అని.. ప్రతీ భారతీయుడికి దేశంపై ప్రేమ ఉండాలని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వాస్తవానికి 'పాక్' అంటే సంస్కృతంలో 'పండటం' అని అర్థం. చక్కర లేదా బెల్లంతో చేసే పదార్థాన్ని కొన్ని భాషల్లో 'పాకం' అంటారు. దీనికి పాకిస్థాన్‌తో సంబంధం లేనప్పటికీ.. పలికే శబ్దం ఆ దేశాన్ని గుర్తు తెచ్చేలా ఉంటడంతో పేరు మార్చామని.. 'శ్రీ' అనే పదం శుభాన్ని సూచిస్తుందని అంజలీ జైన్ అన్నారు.

# కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టిఫిషియల్ లేఖను కూడా సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో

కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# లారీని ఢీకొన్న కారు.. ఆరుగురు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. లారీని కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతులు చీరాల మండలం స్టువర్టుపురం వాసులుగా గుర్తించారు. మరో ఇద్దరూ చిన్నారులకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. దైవదర్శనార్థం మహానంది వెళ్ళి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

## మచిలీపట్నం న్యాయవాది నుండి 19 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక నుండి డిజిటల్ అరెస్ట్ చేశామని బందరుకు చెందిన న్యాయవాదిని బెదిరించి 19 లక్షలు కాజేసిన ఘటన మచిలీపట్నం ఆర్ పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.

మచిలీపట్నం కు చెందిన ఓ ప్రముఖ న్యాయవాదిను కొన్ని రోజుల క్రితం డిజిటల్ అరెస్ట్ చేస్తామని సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. కేసు నుంచి తప్పించుకోవాలంటే 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా , న్యాయవాది 19 లక్షలు కేటుగాళ్లు ఖాతాలో జమ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు నలుగురు మావోయిస్టులు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్రలో గడ్చిరోలి జిల్లాలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, మందు గుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం నుంచి తప్పించుకున్న మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టారు.

## సైనికులను కించపరిచేలా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** సైనికులను కించపరిచేలా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని, దేశం ప్రశాంతంగా ఉందంటే సైనికులే కారణమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ కవిత లేఖ తండ్రి, కూతురుకు సంబంధించినదని అన్నారు. కవిత లేఖపై సాయంత్రం స్పందిస్తానని అన్నారు. కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..2018 ఎన్నికలప్పుడే బిఆర్ఎస్ పొత్తు అంటే వ్యతిరేకించామని, రాజకీయంగా మమ్మల్ని తిట్టండి, సైనికులను కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్జికల్ స్ట్రైక్ పై మాజీ సిఎం కెసిఆర్, కవిత ఆధారాలు అడిగారని అదే తరహాలో ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## ఏసీబీ వలలో జీహెచ్ఎంసి ఏసీపీ

సికింద్రాబాద్: పెన్ పవర్: జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిపింది.ఒక భవనం నిర్మాణం అనుమతి కోసం అసిస్టెంట్ సిటీ ప్లానర్ విఠల్ రావు లంచం డిమాండ్ చేసాడు. 8 లక్షల రూపాయలు లంచం అడిగాడు. ఇప్పటికే నాలుగు లక్షలు ఫిర్యాదుదారుడు వెంకట్రావు ఇచ్చాడు. మిగతా లంచం ఇవ్వకపోయేసరికి అనుమతిని రద్దు చేసాడు. దాంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం నాడు ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ విఠల్ రావు అదుపులో తీసుకున్నారు. విఠల్ రావు భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. మేడిపల్లిలోని ఆయన నివాసంలో, నాచారంలోని ప్రైవేట్ కార్యాలయంలో నగదు తీసుకున్నట్లు గుర్తించారు. విఠల్ రావు నివాసం, కార్యాలయంలో సోదాలు చేస్తున్నారు.

## వచ్చే నెల 4న . వెన్నుపోటు దినోత్సవం

హైదరాబాద్ పెన్ పవర్:వచ్చేనెల 4వతేదీన వెన్నుపోటు దినంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు నిచ్చారు. వచ్చేనెల నాలుగోతేదీన వెన్నుపోటు దినంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు నిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏపీ ప్రజలను మోసం చేసినందుకు నిరసనగా వెన్నుపోటు దినంగా ఆ రోజు నిరసనలను చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిస్తున్నట్లు జగన్ తెలిపారు. జగన్ మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు.హామీలు అమలు చేయకపోవడంతో...జూన్ నాలుగోతేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడి కావడంతో అదే రోజు చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియజెప్పాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలతో పాటు మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపు నిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి



హైదరాబాద్ పెన్ పవర్: ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద శుక్రవారం మధ్యాహ్నం కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను గిద్దలూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం ఆయా మృతదేహాలను ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులంతా స్టువర్ట్‌పురం వాసులను పోలీసులు తెలిపారు.

# పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల సాయాన్ని సమర్థించుకున్న ఐఎంఎఫ్



హైదరాబాద్ పెన్ పవర్:అప్పుల్లో కూరుకుపోయిన దాయాది పాకిస్థాన్‌కు బిలియన్ డాలర్ల (రూ. 8,000 కోట్లకు పైగా) ఉద్దీపన ప్యాకేజీ ఇవ్వడాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి సమర్థించుకుంది. అప్పుల్లో కూరుకుపోయిన ఆ దేశం ఈ రుణాన్ని పొందేందుకు అవసరమైన అన్ని లక్ష్యాలను చేరుకుందని వ్యాఖ్యానించింది. అందుకే ఈ తాజా విడత రుణాన్ని అందించినట్లు స్పష్టం చేసింది.కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో ఉక్కిరిబిక్కిరవుతున్న దాయాదికి ప్రపంచ బ్యాంక్ ఉద్దీపన ప్యాకేజీ రూపంలో భారీ ఊరటనిచ్చింది. ఉద్దీపన ప్యాకేజీ కింద 2 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. అయితే, ఐఎంఎఫ్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పాకిస్థాన్ తన భూభాగాన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు వాడుకోవడానికి అనుమతిస్తోందని, ఆ దేశానికి అందిస్తున్న ఆర్థిక సహాయం 'ఉగ్రవాదానికి పరోక్షంగా నిధులు సమకూర్చినట్లే' అవుతుందని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల వ్యాఖ్యానించారు. అయినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ. 8,540 కోట్లు) ఆ దేశానికి మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది.ఇక ఐఎమ్ఎఫ్ నిధులు విడుదల వేళ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. భారత్ చేసిన వైమానిక దాడుల్లో 14 మంది మసూద్ కుటుంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని ఆ దేశ ప్రధాని పేర్కొన్నారు.ఈ క్రమంలో కేవలం మసూద్ కుటుంబానికి రూ.14 కోట్లు చెల్లించే అవకాశం ఉంది. అదనంగా భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మిస్తామని పాక్ ప్రధాని హామీ ఇచ్చారు. కాగా, ఐఎంఎఫ్ ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కార్యక్రమం కింద పాకిస్థాన్‌కు ఇప్పటివరకు రెండు విడతల్లో 2.1 బిలియన్ డాలర్లు అందజేసింది. గత ఏడాది ఈఎఫ్ఎఫ్ కింద 7 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదిరింది.

# నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు సీఎం అవినీతి బండారం మొత్తం బయటపడిందన్న కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్:

నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరు పెట్టడంతో.. సీఎం అవినీతి బండారం మొత్తం బయటపడింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టాడని ఈడీ నమోదు చేసిన చార్జిషీట్‌తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది అని ధ్వజమెత్తారు.అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయింది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారని కేటీఆర్ అన్నారు.ఇప్పుడు రేవంత్ రెడ్డి %-% పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటాడా..? ఈడీ, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా..? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా..? రాష్ట్ర కాంగ్రెస్‌లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైంది. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోంది. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టే అని కేటీఆర్ పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డికి పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినై.. కమీషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయి. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోంది. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది. చివరికి ధర్మం గెలుస్తుంది అని కేటీఆర్ అన్నారు. చివరకు జై తెలంగాణ.. జై కేసీఆర్.. అని కేటీఆర్ నినదించారు.

## మహానాడు విజయవంతంలో యువత కీలక పాత్ర పోషించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**కడప నగరంలోని ద్వారకనగర్‌లో మహానాడు సభ ప్రాంగణం వద్ద వాలంటీర్ల కమిటీ ఏర్పాటుకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో, పోలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి రవిశంకర్ రెడ్డి , రెడ్డయ్య యాదవ్ , మసాపేట శివ వేణు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, యువత పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా తెలియజేశారు.

## వారం రోజుల పోలీసు కస్టడికి సిరాజ్, సమీర్

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ ఎన్ఐఏ స్పెషల్ కోర్టు శుక్రవారం నాడు ఉగ్రవాది నేరస్తుల కు ఏడు రోజుల పోలీసు కస్టడీ ఇచ్చింది. నిందితులు సిరాజ్, సమీర్. విశాఖ సెంట్రల్ జైలు నుంచి విజయనగరం కు తరలించారు. పోలీసులు, ఎన్ఐఏ అధికారులు సిరాజ్, సమీర్ను వారం రోజుల పాటు ప్రశ్నించనున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ మినీ మహానాడు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహానాడుకు సన్నద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా మినీ మహానాడు కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొని మహానాడు విజయవంతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.దీంట్లో బాగంగా విశాఖ పార్లమెంటు మహానాడు జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి ప్రజా ప్రతినిదులు పాల్గోన్నారు.రాష్ట్రప్రజలు, కార్యకర్తల నమ్మకానికి అనుకూలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు.

## తొమ్మిది కిలోమీటర్లు డోలి అవస్థలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ కొండశిఖర పీవీటీజీ మద్రేబు గ్రామంలో అస్వస్థతకు గురైన మహిళను 9 కిలోమీటర్ల మేర డోలీలో తరలించారు. మద్రేబుకు చెందిన కిలుమో అనే మహిళ అస్వస్థతకు గురైంది. ఈ క్రమంలో తమ గ్రామం నుండి తునిసీబు గ్రామం మీదుగా హుకుంపేట మండలం దుర్గం పంచాయతీ ధారగడ్డ వరకు 9 కిలోమీటర్లు ఆమె భర్త నర్సింగ్ రావు, కుమారుడు డోలీలో మోసుకొని తీసుకవచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్ లో పాడేరుకు తరలించారు.

## అనుమానాస్పద స్థితిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి మంగళపల్లి గేట్ వద్ద, సుప్రియ బాయ్స్ హాస్టల్ రెండవ అంతస్తు ఓ గదిలో ఉంటున్న, భారత్ ఇంజనీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోలే నాగిరెడ్డి(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న ఏసిపి కెపివి రాజు, సిఐ జగదీష్ హాస్టల్ గదిలో ఇద్దరు ఉంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కి తరలించారు పోలే నాగిరెడ్డి, జంగమహేశ్వర గ్రామం, గురజాల మండలం, గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.

## చిన్న, సన్న కారు రైతులను కూడా ఆయిల్ ఫాం వైపు మళ్ళించాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సమీక్షా నిర్వహించారు. ముందుగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జిల్లాలో ఇప్పటి వరకు 12339 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతుందని అలాగే, 2025-26సంవత్సరానికి గాను 6500ఎకరాల లక్ష్యం పెట్టుకొని ఇప్పటివరకు 1612 ఎకరాలు 456 మంది రైతులను గుర్తించడం 209 రైతుల నుండి 661.5 ఎకరాల డిడి కలెక్షన్ జరిగిందని జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట 674 టన్నుల గెలలు కటింగ్ చేసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట లో ఉన్న ఫ్యాక్టరీ పంపినట్లు తెలిపారు.

ఈ సమావేశం లో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫాం సాగు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన 6500ఎకరాల లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చెయ్యాలి. అలాగే 300 కోట్ల తో నిర్మాణం చేపడుతున్న ఆయిల్ పాం కర్మాగారం సైతం అతి త్వరలో పూర్తి అవుతుందని అన్నారు. ఇది వరకు నిర్వహించిన సమావేశానికి పనుల్లో చాలా ప్రోగ్రెస్ వచ్చిందని అధికారులను అభినందించారు.

క్షేత్ర స్థాయిలో అధికారులు రైతుల ఇంటికి వెళ్లి ఆయిల్ పాం వల్ల కలిగే లాభాలు తెలుపి ప్రేరణ కల్పించాలి. గ్రామాల్లో అయిల్ ఫాం సాగు గుర్చి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. రైతులకు ఆయిల్ ఫాం గుర్చి వివరంగా తెలియడం కోసం ఇది వరకు ఆయిల్ ఫాం పంట వేసి లాభాలను ఆర్జించిన రైతులను మరియు ఆయా పంటలను క్షేత్ర స్థాయిలో వీక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ఆయిల్ పాం సాగులో దశలు రైతులను ఎంపిక చెయ్యడం, డిడి కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు పెట్టడం అనే ప్రక్రియను వెంటవెంటనే పూర్తి చెయ్యాలి. మీ మండలాలోని పనిలో వెనకబడిన క్లస్టర్ల ను రోజువారీ పర్యవేక్షణ చేసి ఆయా క్లస్టర్ లలో రైతులతో వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు మీటింగ్ లు పెట్టాలి. పెద్ద భూస్వాములనే కాకుండా చిన్న, సన్న కారు రైతులను కూడా ఆయిల్ ఫాం వైపు మళ్ళించాలి. ప్రోగ్రేస్ తక్కువ ఉన్న క్లస్టర్ లలో ఈ సీజన్ పంట పూర్తైన తర్వాత రైతులను గుర్తించాలి. వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్ అధికారులు అందరు సమన్వయంతో 100% పూర్తి లక్ష్యాన్ని చేరేవిధంగా పని చేయ్యాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో టీజీ ఆయిల్ ఫెడ్ ఓఎస్ డి ప్లాంటేషన్, కిరణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి




**హైదరాబాద్ పెన్ పవర్:** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, ఎస్.పి హర్షవర్ధన్ రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ శ్రీమతి హన్సవదన లతో కలిసి యూపీఎస్సీ

ప్రత్యేక అధికారి మరియు సంయుక్త కార్యదర్శి ఎస్.జి. అజ్మీర సమీక్షా సమావేశం నిర్వహించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సంబంధిత అధికారులతో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, ఎస్.పి హర్షవర్ధన్ రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ హన్సవదన, కలిసి యూపీఎస్సీ ప్రత్యేక అధికారి మరియు సంయుక్త కార్యదర్శి ఎస్.జి. అజ్మీర సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ నెల 25వ తేదిన నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలకు తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలను 12 ప్రభుత్వ కళాశాలలు, ఒక ప్రైవేట్ కళాశాలలో మొత్తం 13సెంటర్ల ను ఏర్పాటు చేయడం జరిగిందనని ఈ పరీక్షలకు 5261 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వారు తెలిపారు. పకడ్బందీగా ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని సూచించారు. యూపీఎస్సీసివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయని తెలిపారు. (2 సెషన్స్) ఉ. 9.30 నుండి ఉ 11.30, వరకు మరియు మ. 2.30 నుండి మ 4.30వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కగా ఉండాలని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరిక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఒక్క నిమిషం అలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతకరమైన వాతావరణంలో పరిక్షలు రాయాలని సూచించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలు జరుగు ప్రదేశాలలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, వైర్లెస్ హెడ్ సెట్స్,తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని , పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయమైన సంగటనలు జరగకుండా 144 సెక్షన్ బందోబస్తు, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్ళుటకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలనీ పోలీస్ వారిని ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు వెళుటకు ఆర్టీసి బస్సులను ఏర్పాటు చేయాలనీ, పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబందితశాఖల అధికారులు చూడాలని, మున్సిపాల్ అధికారులు పరీక్షా కేంద్రాలలో త్రాగు నీరు, టాయిలెట్స్, పరిసరాలను శుబ్రంగా సక్రమంగా ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల సౌకర్యార్థం మెడికల్ కిట్లుతో పాటువైద్య ఆరోగ్య సిబ్బందిని ఉంచాలని సూచించారు. పరిక్షలు వ్రాసే అభ్యర్థుల సౌకర్యార్థం మొబైల్ లాకర్స్ ను ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద జామర్లను ఏర్పాటు చేయాలని, బయట వ్యక్తులనుపరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని తెలిపారు.